క్లుప్తంగా

అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో ప్రతిభ



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

మదనపల్లె సిటీ : కర్నూలులో జరిగిన అంతర్ రాష్ట్ర కరాటే పోటీల్లో మదనపల్లె పట్టణం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇందులో కటా, కుమితి విభాగాల్లో 12 బంగారు పతకాలు, 10 రజత, 11 క్యాంస పతకాలు సాధించినట్లు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం చైర్మన్ అమృతప్రసాద్, డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ షహనాజ్, కరాటే మాస్టర్ సదాశివ అభినందించారు.

ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం



లక్కీ డ్రా తీస్తున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, అందరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బస్టాండులో మదనపల్లె-తంబళ్లపలెల రూట్‌లో ప్రయాణికుల కోసం విద్యార్థులు లక్కీ డ్రా తీశారు. ప్రయాణికుల కోసం గ్రామీణ ప్రాంతాలకు సైతం బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సంస్థను ఆదరించాలని కోరారు. లక్కీ డ్రాలో శ్రీనివాసులు, వెంకటప్ప, బాలా విజేతలుగా నిలిచారు. వీరు డిపోకు వచ్చి బహుమతులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రేవతి, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సర్వేయర్‌గా కిరణ్మయి



తహసీల్దారుకు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న సర్వేయర్ కిరణ్మయి

పీలేరు : పీలేరు మండల సర్వేయర్‌గా కిరణ్మయి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ సర్వేయర్‌గా ఉన్న హరికృష్ణ బదిలీపై సంబేపల్లెకు వెళ్లారు. పలమనేరులో సర్వేయర్‌గా పని చేస్తున్న కిరణ్మయి బదిలీపై పీలేరుకు వచ్చారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

నేటి నుంచి సబ్సిడీతో ఉలవలు పంపిణీ

వాల్మీకిపురం : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచి ఉలవలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయశాఖ ఏఓ హేమలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 317 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి చేతులమీదుగా ఉలవల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కిలో ఉలవ విత్తనాల ధర రూ.87 ఉండగా, సబ్సిడీ 80 శాతం పోను రైతులు కిలోకు రూ.17.40 చెల్లించి, 10 కిలోల ప్యాకెట్లను తీసుకోవాలన్నారు.

బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్‌గా వెంకటేశ్వర్లు

బి.కొత్తకోట : స్థానిక సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎం.పార్థసారధి కలికిరి సబ్‌రిజిస్ట్రార్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడపలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ వై.ఉదయకుమార్‌రెడ్డిని తంబళ్లపల్లెకు బదిలీ చేయగా, పుంగనూరులో పనిచేస్తున్న ఎ.హరికుమార్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. అలాగే బి.కొత్తకోట మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బాలాజీని పెద్దతిప్పసముద్రంకు, ములకలచెరువులో పనిచేస్తున్న వి.వీరాంజనేయులును ఇక్కడికి బదిలీ చేశారు.

విద్యాసామగ్రి అందజేత

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న ధాత్రిఫౌండేషన్ నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు బుధవారం విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. కృషి వికాస్ ఫౌండేషన్ సహకారంతో విద్యాసామగ్రిని అందజేసినట్లు ధాత్రిఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ స్వాతి తెలిపారు.

ఘనంగా ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్ధంతి

మదనపల్లె సిటీ : స్థానిక బెంగళూరు రోడ్డులోని మరసం కార్యాలయంలో బుధవారం సాయంత్రం ప్రముఖ సినీ గాయకుడు, పద్మశ్రీ ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. నాగభూషణం, వివిఎం నాగరాజు,శ్రీనివాసులు, రామమోహన్ నాయుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం ఆలపించిన సినీ గీతాలను ఆలపించారు. చిత్రసీమకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మరసం అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి లింగాల యుగంధరాచారి,వాసుదేవరావు, రాంమోహన్‌నాయుడు,మంజుప్రీతం

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

- రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలి
- ఏడీఏ శివశంకర్



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు

మదనపల్లె : ప్రతి పంట సాగులోనూ రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏడీఏ శివశంకర్ సూచించారు. బుధవారం మండలపరిధిలోని కోళ్లబైలు గ్రామం మేకలవారిపల్లె, పాన్నేటిపాలెం గ్రామం పనసమాకులపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పంటపొలాలను పరిశీలించి, రైతులకు సూచనలు అందించడం జరిగింది. జీవసంబంధ విలువైన పాస్ఫో బ్యాక్టీరియం, అజోస్పైరిల్లం, రైజోబియం వంటి ఎరువులను వినియోగించినట్లయితే భూమిలోని పోషకపదార్థాలను అవి సహజసిద్ధంగా మొక్కలకు అందుబాటులోకి తెచ్చి అధిక దిగుబడులకు దోహదపడుతాయని తెలియజేశారు. అలాగే భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకున్నట్లయితే ఖర్చుతగ్గి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. పశుసంవర్ధకశాఖ అధికారులు పాడిపశువుల్లో వచ్చే వ్యాధులు, నివారణ, ముఖ్యంగా పొదుగువాపు, గాలికుంటువ్యాధి నివారణ చర్యలను తెలియజేశారు. టీకాలు సరైన సమయంలో వేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఏఓ నాగప్రసాద్, పశుసంవర్ధక అధికారి ప్రసాద్‌రెడ్డి, పట్టుపరిశ్రమ అధికారి రసూల్, వ్యవసాయసహాయకులు శేఖర్, విజయకుమారి, రైతులు పాల్గొన్నారు.

దళితుల ఇళ్ల నిర్మాణాలు కూల్చడం అన్యాయం



ఇళ్ల నిర్మాణాలు కూల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు టి.ఎల్. వెంకటేష్

కేవీపల్లె : ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మండలంలోని మల్లారపువాండ్లపల్లె వద్ద దళితుల ఇంటి నిర్మాణాలు కూల్చడం అన్యాయం. వెంటనే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఇళ్ల నిర్మాణాలు కూల్చి వేసిన ప్రాంతాన్ని పరిశీలించి బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు స్థలం చదును చేసుకుని గత రెండు సంవత్సరాలుగా నిర్మాణ పనులు చేస్తున్నారని తెలిపారు. స్థల సమస్య ఉంటే రెవెన్యూ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. రాజకీయాల కోసం దళితులను వాడుకోవద్దను పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టడానికి దళితులు పాడి ఆవులను సైతం అమ్ముకున్నారని, మరికొందరు బంగారు తాకట్టుపెట్టారని తెలిపారు. విద్యుత్ సౌకర్యం, బోరు సౌకర్యం కల్పించడంతో ఎలాంటి ఇబ్బంది ఉండదని నిర్మాణాలు చేపట్టారన్నారు. ఇదే గ్రామంలో అగ్ర వర్ణాలు వారు చెరువు స్థలంలో కాంప్లెక్స్‌లు నిర్మించినా పట్టించుకోని అధికారులు దళితుల ఇళ్ల నిర్మాణాలు పడగొట్టడం అన్యాయమన్నారు. దళితులకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాధితులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో కన్నెమడుగు విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులతో పీడీ మొఘల్‌బాషా

తంబళ్లపల్లె : కురబలకోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన నియోజకవర్గ క్రీడా పోటీలు అండర్ -14, -17 విభాగాల్లో కన్నెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. తొమ్మిది మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికకావడం విశేషం. 7వ తరగతి ధరణి 600 మీటర్ల పరుగుపందెంలో మొదటి స్థానం, రెడ్డినవిత 100 మీటర్లు పరుగు పందెంలో మొదటి స్థానం, హైజంప్‌లో రెండవ స్థానంలో నిలిచింది. 9వ తరగతి విద్యార్థులు యుగంధర్ 1500 మీటర్ల పరుగుపందెంలో రెండవ స్థానం, హర్ష 200 మీటర్ల పరుగుపందెంలో మొదటి స్థానం, సుమిత్రలాంగ్‌జంప్‌లో మొదటి స్థానం నిలిచింది. దీపిక 800 మీటర్ల పరుగుపందెంలో రెండవ స్థానం,రోహిణి డిస్క్‌త్రోలో రెండవ స్థానం, కళ్యాణి 400 మీటర్ల పరుగుపందెంలో రెండవ స్థానం, నిరూప 100 మీటర్ల పరుగుపందెంలో రెండవ స్థానంలో నిలిచి శభాష్ అనిపించుకున్నారు. వీరందరూ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ మొగల్‌బాషా తెలిపారు. 26వ తేదీ చిత్తూరు పీఎన్‌ఆర్ స్టేడియంలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ రాజమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక కోటపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలు, గుడ్లు, ఆకు కూరలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అక్కాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతిలత, అనిత, అన్నపూర్ణ, ఇంద్ర, సంపూర్ణ, విజయ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

తంబళ్లపల్లె : గర్భిణులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే తల్లిబిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ నాగవేణి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పౌష్టికాహార మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధ్యానాలతో చేసిన వంటకాలు,ఆకుకూరలు, తాజా కూరగాయాలు,పప్పుదినుసులు తదితరాలతో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది. పౌష్టికాహార విలువలు,కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, కార్యాలయ ఏఓ ఆనంద్‌కుమార్, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, సిద్దమ్మ,అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో కళాశాలలో సమావేశం

మదనపల్లె సిటీ : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. విద్యార్థులు సమయపాలన పాటించడం, నిత్యం హాజరుకావడం, ఎప్పటి పాఠాలు అప్పుడే చదవడంతో పాటు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిరోజు బాధ్యతాయుతంగా మెలగాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటరమణ, శివపార్వతి, సేగు రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ సీట్ సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థి



మహమ్మద్ షాహిద్ ఖాన్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

నిమ్మనపల్లె : మోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసించిన విద్యార్థి, నీట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపి, ఎస్వీ మెడికల్ కళాశాలలో మెడికల్ సీట్ సాధించినట్లు రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కె ఎస్ ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయ బందంతో కలిసి విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ పి.హఫీజ్ ఖాన్, ఫర్హద్‌భాను దంపతుల కుమారుడు పి.మహమ్మద్ షాహిద్ ఖాన్ 2023 లో ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్‌ను పూర్తి చేశారన్నారు. 2024లో జరిగిన వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ -25769, రాష్ట్రస్థాయిలో ర్యాంక్ -546 సాధించి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాలలో ప్రవేశఅర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కురబలకోట: విద్యార్థులు చదువు సంధ్యలతో పాటు క్రీడల్లో రాణించాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నాయకులు దాసిరిపల్లె జయచంద్రారెడ్డి కోరారు. బుధవారం ఆయన సర్కారుతోపులో జరిగిన మంచి ప్రభుత్వం కార్యక్రమ అనంతరం స్థానిక సచివాలయాన్ని ప్రారంభించారు. ఆతర్వాత కురబలకోట జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల కార్యక్రమంలో మాట్లాడుతూ క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. నియోజక వర్గం నుండి జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలచిన వారికి రూ.50 వేలు, ద్వితీయ స్థానం కింద రూ.25 వేలు బహుమానంగా సొంత నిధులు అందజేస్తానన్నారు. మాజీ మండల కన్వీనర్ జంగా రాఘవరెడ్డి, హెడ్మాస్టర్ త్రివేణి, పీఈటీ పీడీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

28న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మదనపల్లె : మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సెప్టెంబర్ 28వ తేదీ నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ వి.మనూజారెడ్డి తెలిపారు. బుధవారం కౌన్సిల్ సమావేశానికి సంబంధించి అజెండా కాపీలను కౌన్సిలర్లకు అందజేశారు. అజెండాలో 30 అంశాలను ప్రతిపాదించామని, సభ్యులందరి ఆమోదం మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి సలహాలు, సూచనలు, ప్రజాసమస్యలను కౌన్సిల్ సభ్యులు సమావేశంలో ప్రస్తావిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మిట్స్ విద్యార్థులకు రూ.30వేల స్కాలర్‌షిప్

కురబలకోట : మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు సందీప్, తేజ్‌దీప్, శివకుమార్, లక్ష్యకు రూ. 30 వేలు చొప్పున కేంద్ర సాయుధ పోలీసుల బలగాలు, ప్రైమ్ మినిస్టర్స్ స్కాలర్‌షిప్ లభించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ స్కాలర్‌షిప్‌లు వచ్చినట్లు తెలిపారు. మరో ఇద్దరికి సెంట్రల్ సెక్టార్ స్కీం కింద రూ. 12వేలు చొప్పున స్కాలర్‌షిప్ లభించినట్లు తెలిపారు.

చెరువు స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

కేవీపల్లె : మండలంలోని సొరకాయలపేట పంచాయతీ వంకవడ్డిపల్లె సమీపంలో ఉన్న వంగిమాని ఒడ్డు (చెరువు) స్థలం ఆక్రమణపై గ్రామానికి చెందిన కె. సిద్ధయ్య, సి. విజయకుమార్‌రెడ్డి, కె. రాజన్న మరికొందరు రైతులతో కలసి తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుకు సంబంధించి ఓ మొరవ ప్రాంతాన్ని గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి వేరే సర్వే నెంబరుతో పట్టా చేసుకుని ఆక్రమించుకున్నాడని తెలిపారు. ఈ చెరువు ఆక్రమణతో రైతులు పొలాలకు వెళ్లడానికి దారిలేకుండాపోయిందన్నారు. అలాగే కట్టతెగిపోయి ఆయకట్టు రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రైవర్ల సంఘం కార్యవర్గ ఎన్నిక

బి.కొత్తకోట : స్థానిక లైట్ మోటార్ డ్రైవర్స్ సంఘ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి, ప్రధానకార్యదర్శిగా హరూన్‌షరీఫ్, కోశాధికారిగా రమణ, సహాయ కార్యదర్శులుగా లక్ష్మణరెడ్డి, నాగరాజు, గౌరవాధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, కార్యవర్గసభ్యులుగా రాజశేఖర్‌రెడ్డి, నారాయణస్వామి, నారాయణమూర్తి, సునీల్, నరసప్ప, వెంకటరమణారెడ్డి, సలహాదారులుగా బలరాంరెడ్డి, వెంకటకృష్ణయ్యలను ఎన్నుకున్నారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన



హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

పీలేరు : మండలంలోని రేగళ్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎయిడ్స్ / హెచ్‌ఐవీ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రాజమ్మ మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, ఎలా రాదు, హెచ్‌ఐవీ తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెచ్‌ఐవీ బాధితులకు ప్రభుత్వం అందించే వైద్యసేవలు గూర్చి అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ సోకిన వారిపట్ల వివక్షత చూపకుండా స్నేహభావంతో మెలగాలన్నారు. హెచ్‌ఐవీకి చికిత్సలేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పార్వతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హమాలీల ధర్నా

బి.కొత్తకోట : స్థానిక ఇందిరమ్మ కాలనీలోని పౌరసఫరాల గోదాము ఎదుట బుధవారం హమాలీలు ధర్నా నిర్వహించారు. హమాలీలకు ప్రతినెలా మొదటివారంలోనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి పెంచిన వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సలీంబాషా, వేణుగోపాల్‌రెడ్డి విమర్శించారు. యూనియన్ నాయకులు బావాజాన్, గంగాధర్, రాజు, వెంకటరమణ, జబీబుల్లా, జయరాం, ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

30న అంబేడ్కర్ ధమ్మ యాత్ర

పీలేరు : పీలేరు పట్టణంలో అంబేడ్కర్ ధమ్మ యాత్ర ర్యాలీ నిర్వహించనున్నట్లు బహుజన సంక్షేమ సంఘం నాయకులు ఎ. బలరాం తెలిపారు. ఈ నెల 30న సాయంత్రం 3 గంటలకు బహుజన సంక్షేమ సంఘం, శాంతి చక్ర ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు నుంచి అంబేడ్కర్ విగ్రహ వరకు బౌద్ధ భిక్షువులచే ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రజలతో పాటు మండల పరిధి నుంచి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యం



రామసముద్రం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం : పారదర్శక పాలనే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం రామసముద్రం మండలం ఆర్.నడింపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజిల శంకుస్థాపన చేశామన్నారు. వాలీశ్వరస్వామి కొండ రోడ్డు రూ.2 కోట్లు , గట్టు వెంకటేశ్వరస్వామి ఆలయం రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరు చేశామన్నారు. టీడీపీ నాయకులు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసాగర్, రాటకొండ మధుబాబు, సీతారామయ్య, కృష్ణంరాజు, బిజెపి కృష్ణమూర్తి, బాలాజి, కృష్ణప్ప, చిన్నూస్వామి, కైకాల బాబు, అల్తాఫ్ పాల్గొన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం కోసం కృషి

వాల్మీకిపురం : సంక్షోభంలో కూడా ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతగానో శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద, మండలంలోని చింతపర్తిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి ఒక్క హామీ తప్పకుండా నెరవేర్చే దిశగా సీఎం అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పామిలేటి, ఎంపీడీఓ మనోహర రాజు, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కంభం నిరంజన్ రెడ్డి, నాయకులు మల్లికార్జున రెడ్డి, క్రిష్టారెడ్డి, సత్యారెడ్డి, పివి నారాయణ, గాంధీపేట రమణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎమ్‌లను వైద్యశాఖకు బదిలీ చేయాలి

మదనపల్లె : క్షేత్రస్థాయిలో వైద్యసేవల్లో కీలకపాత్ర పోషిస్తూ, ప్రజారోగ్య కార్యక్రమాలను అమలుచేస్తున్న ఏఎన్ఎమ్(గ్రేడ్-3)లను సచివాలయం నుంచి వైద్యశాఖకు బదిలీచేయాలని, విధులపై స్పష్టత ఇవ్వాలని ఏపీ గ్రామ,వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీస్, ఏఎన్ఎమ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి.లీలావతి డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో...ఏఎన్ఎమ్‌లకు సాధారణ కార్యనిర్వాహక విధులు అప్పగించరాదని, వైద్య, ఆరోగ్యశాఖ ఇచ్చిన స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నప్పటికీ, వారికి సంబంధం లేని విధులు అప్పగిస్తున్నారన్నారు. ఏఎన్ఎమ్‌లను రెండుశాఖల కింద విధులు చేయిస్తుండటంతో ద్వంద నియంత్రణ కారణంగా మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నామన్నారు. పంచాయతీరాజ్‌శాఖకు, వైద్య ఆరోగ్యశాఖలకు మధ్య సమన్వయం లేకపోవడంతో శాఖల అధికారులు ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారన్నారు, ఏఎన్ఎమ్‌లు, హెల్త్ సెక్రటరీలు ఎవరి మాట వినాలో తెలియక గందరగోళంలో పడి పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉన్నతస్థాయి అధికారులు వెంటనే కలుగజేసుకుని సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యేక కార్యాచరణకు దిగుతామన్నారు.

పండిట్ దీనదయాళ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



దీనదయాల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె సిటీ : పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లి రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంత్యోదయకు, పేదల సేవలకు ఆయన ఇచ్చిన ప్రాధాన్యం బీజేపీకి ప్రేరణ ఇస్తూనే ఉంటుందన్నారు. ఆయన్ను అందరూ స్మరించుకోవాలన్నారు. ఆయన తాత్విక సిద్ధాంతాల పునాదుల మీద ఈ రోజు భారత్ స్వసక్తి, స్వాభిమానం, ఆత్మనిర్భయ్ భారత్‌గా ప్రపంచంలో ఐదవ ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి ప్రశాంత్, ఆకుల కృష్ణమూర్తి, ఓసూరి కిరణ్, భువనేశ్వరి సత్య, నాగరాజు, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాల్‌కు నివాళులు

కలికిరి : పండిట్ దీన్‌దయాల్ జయంతి సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కుటుంబలో జన్మించిన దీనదయాల్ అసమాన్యుడుగా ఎదిగారని,

సృజనాత్మకతను పెంచేందుకే చెకుముకి పరీక్షలు



చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్న జేవీవీ సభ్యులు



నిమ్మనపల్లెలో చెకుముకి టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

మదనపల్లె : విద్యార్థుల్లో సృజనాత్మకను పెంచేందుకు జనవిజ్ఞానవేదిక (జేవీవీ)నిర్వహిస్తున్న చెకుముకి టాలెంట్ టెస్టులు ఉపయోగపడతాయని జేవీవీ అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షులు తెలకపల్లి హరీంద్రనాథ్ శర్మ, యస్.చంద్ర అన్నారు. పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ లను స్థానిక జెడ్పీ హై స్కూలులో వారు బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్, ఉపాధ్యక్షులు జయచంద్ర, కార్యదర్శి వేణుగోపాల్ రెడ్డి, వెంకటరమణలు, సైన్స్ ఫోరమ్ నాయకులు భాస్కరన్, శాస్త్రి పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచడానికి..

నిమ్మనపల్లె : విద్యార్థులలో సైన్సు పట్ల ఆసక్తి, పెంచేందుకు చెకుముకి పరీక్ష నిర్వహించినట్లు మండలంలోని జడ్పీ హై స్కూల్ హెచ్‌ఎంలు అంజాద్‌అలీ ఖాన్, రమేష్, శైలజ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కె.ఎస్.ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం చెకుముకి టాలెంట్ టెస్టను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలం లోని ఏపీ మోడల్ స్కూల్, నిమ్మనపల్లి, రెడ్డివారి పల్లి, బాలినాయనపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు చెకుముకి పరీక్షను నిర్వహించినట్లు తెలిపారు.

వైభవం..శివ పార్వతుల కల్యాణం



స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రసన్న సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం శివాలయం సేవకులు పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో జరిగిన శివ పార్వతుల కళ్యాణోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహించారు. శివ పార్వతుల ప్రతిమలకు ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.